RNI No: APTEL/2018/76747



# నవతరం

తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | గురువారం | సంపుటి: 9 | సంచిక: 237 | పేజీలు: 04 | వెల: 5 /- | 27 ఆగస్టు 2026 |

# 'ఇన్ - సర్వీస్ టీచర్లకు' టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

- బమ్మిడి దుర్యోధనరావు ఇరవై ఏళ్లు పిల్లలకు పాఠం చెప్పిన టీచర్..
- ఇప్పుడు మళ్లీ పరీక్ష రాయాలా? ఇదెక్కడి న్యాయం?
- టెట్ కొత్త టీచర్లకు.. పాత టీచర్లకు కాదు
- అనుభవాన్ని అవమానించొద్దు!
- తమిళనాడు చేసింది.. ఏపీ ఎందుకు చేయదు?
- అసెంబ్లీలో తీర్మానం పెట్టండి!
- సస్పెన్షన్లతో బెదిరిస్తే ఉద్యమం ఆగదు
- టీచర్లను వేధించడం ఆపండి!

**పలాస, నవతరం:** ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో అవిశ్రాంతంగా సేవ అందిస్తూ, ప్రభుత్వ విద్యా వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని, ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పలాసలోని వైఎస్ఆర్సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఇరవై ఏళ్లుగా నల్లబల్ల ముందు నిలబడి వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడిని మళ్లీ బెంచీ మీద కూర్చోబెట్టి పరీక్ష రాయమనడం దారుణం, ఇది అనుభవాన్ని అవమానించడమే" అని మండిపడ్డారు. టెట్ అనేది కేవలం ఉపాధ్యాయ అర్హతను నిర్ధారించే ప్రాథమిక పరీక్ష మాత్రమేనని, ఇది కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టే అభ్యర్థులకు వర్తించాలే తప్ప, ఇప్పటికే డీఎస్సీ ద్వారా అన్ని అర్హతలతో నియామకం అయి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగాల్లో చేరి, పదేళ్లు, పదిహేనేళ్లు, ఇరవై ఏళ్లుగా మారుమూల గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఎండనక వాననక పనిచేస్తూ, లక్షలాది మంది పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులకు మళ్లీ ఈ అర్హత పరీక్ష రాయాలని నిబంధన పెట్టడం ఏ మాత్రం న్యాయం కాదని, ఇది వారిని మానసికంగా, శారీరకంగా వేధించడమే అవుతుందని అన్నారు."టెట్ కొత్త టీచర్లకు వర్తించాలి, పాత టీచర్లకు కాదు, వారి సేవా అనుభవమే అతి పెద్ద అర్హత, దానిని కాదని కొత్త నిబంధనలు తీసుకురావడం సరికాదు" అని ఆయన స్పష్టం చేశారు.

ఒక ఉపాధ్యాయుడు తన జీవితంలో ఎక్కువ భాగం విద్యార్థుల కోసం, పాఠశాల అభివృద్ధి కోసం త్యాగం చేస్తే, చివరకు అతని ఉద్యోగానికే ముప్పు వచ్చే పరిస్థితి కల్పించడం బాధాకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందాలంటే ఉపాధ్యాయులు ప్రశాంతంగా, భయం లేకుండా బోధన చేయాలని, కానీ టెట్ భయంతో వారు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు.సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు నేపథ్యంలో నియామకాలు, పదోన్నతులు, సేవా కొనసాగింపు వంటి అంశాల్లో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల్లో నెలకొన్న తీవ్ర ఆందోళన, భయాందోళనలు, సందేహాలను రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. టెట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు అండగా నిలబడాలని, వారికి పూర్తి భరోసా కల్పించాలని, వారి ఉద్యోగ భద్రతకు హామీ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం ఉపాధ్యాయులకు మేలు చేసే విధంగా, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉండాలన్నారు.ఈ విషయంలో తమిళనాడు ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అనుసరించాలని సూచించారు. "తమిళనాడు ప్రభుత్వం చేయగలిగింది.. ఏపీ ప్రభుత్వం ఎందుకు చేయలేదు?" అని ప్రశ్నించారు. తమిళనాడు ప్రభుత్వం తన రాష్ట్రంలోని ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పిస్తూ అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిన విధంగానే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా వెంటనే అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, అవసరమైతే న్యాయ నిపుణులతో, అడ్వకేట్ జనరల్ తో సంప్రదించి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసే అంశాన్ని కూడా పరిశీలించాలని డిమాండ్ చేశారు.




ఇప్పటికే పలు రాష్ట్రాలు ఈ దిశగా ఆలోచిస్తున్నాయని, ఏపీ కూడా ముందుకు రావాలన్నారు.ఇది కేవలం ఉపాధ్యాయుల సమస్య మాత్రమే కాదని, రాష్ట్రంలోని వేలాది మంది ఉపాధ్యాయుల భవిష్యత్తు, వారి కుటుంబాల సంక్షేమం, విద్యార్థుల విద్యా ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన అంశమని అన్నారు. "ఇది కేవలం టీచర్ల సమస్య కాదు, వేల కుటుంబాల ఆత్మగౌరవ సమస్య, టీచర్ ఆందోళనలో ఉంటే తరగతి గదిలో పాఠం సాగదు, దీని ప్రభావం నేరుగా విద్యార్థులపై పడుతుంది" అని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఆందోళనలో ఉంటే విద్యా వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంలో ముఖ్యమంత్రి వెంటనే స్పందించి, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో, విద్యా శాఖ ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించి వారికి న్యాయం చేయాలన్నారు. అంతేకాకుండా ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల న్యాయపరమైన టెట్ పోరాటంలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘ నాయకులపై ప్రభుత్వం కక్షపూరితంగా పెట్టిన సస్పెన్షన్లను వెంటనే ఎత్తివేయాలని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, "సస్పెన్షన్లతో బెదిరిస్తే ఉద్యమం ఆగదు, వేధింపులు ఆపి చర్చలకు రండి" అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉపాధ్యాయులకు న్యాయం జరిగే వరకు వైఎస్ఆర్సీపీ వారికి అండగా ఉంటుందని, అవసరమైతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.

## సుజలాం దోపిడీకి
# పంచాయతీ పాపం.. మున్సిపాలిటీ మౌనం

- 16 ఏళ్లుగా ప్రజల నీటిపై వ్యాపారం.. రెండేళ్లుగా మున్సిపాలిటీ ఏం చేస్తోంది?
- సబ్సిడీ నీటికి రూ.10 వసూళ్లు..ఆటోల ద్వారా చిల్లర దుకాణాలకు, ఫంక్షన్లకు సరఫరా..లెక్కలు తేల్చాలని ప్రజల డిమాండ్
- గత పంచాయితీ ఎలాగో తప్పు చేసింది.. ఇప్పటి మునిసిపాలిటీ అయినా చర్యలు తీసుకుంటుందనే నమ్మకం ప్రజల్లో పోయింది
- అక్రమాన్ని ఎండగట్టలేని మునిసిపల్ అధికారులు పదవిలో ఎందుకు?
- ప్రజల సొమ్ము తింటున్న మునిసిపల్ అధికారులు ప్రజల రొమ్ము గుద్దే ప్రయత్నం గా కనిపిస్తోందననే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి






**నవతరం ప్రతినిధి, ఖమ్మం – భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:** ప్రజలకు తక్కువ ధరకు శుద్ధజలం అందించాలనే ప్రభుత్వ లక్ష్యంతో ఏర్పాటు చేసిన సుజలాం ఆర్.ఓ. ప్లాంట్ ఇప్పుడు కొందరి ప్రైవేటు వ్యాపారానికి అడ్డాగా మారిందా? అనే ప్రశ్నలు అశ్వారావుపేట ప్రజల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ప్రభుత్వ సబ్సిడీని పక్కనపెట్టి, నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా నీటిని విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ హయాంలో జరిగిన పరిణామాలు, మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత అధికారుల మౌనం.. మొత్తం వ్యవహారంపై అనేక అనుమానాలకు తావిస్తోంది. గత పంచాయతీ నాటి నిర్లక్ష్యం.. నేటి దోపిడీకి బాట? సుజలాం ప్లాంట్ నిర్వహణకు సంబంధించిన గత పంచాయతీ కాలం నాటి నిర్ణయాలు, లీజు నిబంధనలు, పర్యవేక్షణ వ్యవస్థపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. ప్రజా ప్రయోజనం కోసం ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను ఒక వ్యక్తి నిర్వహణకు అప్పగించిన తర్వాత నిబంధనలు సక్రమంగా అమలయ్యాయా? లేక పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో నిర్వాహకుడికి క్రమంగా పట్టు పెరిగిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్లాంట్ నిర్వహణ హక్కులు పొందిన వ్యక్తి అనంతరం దానిని అధిక మొత్తంలో రూపాయలలో సబ్సిడీ ని మించి అమ్మకాలు జరుపుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. రూ.2 నుంచి రూ.4 ఉండాల్సిన చోట రూ.10! సుజలాం ప్లాంట్ ద్వారా 20 లీటర్ల నీటి క్యాన్‌కు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూ.2, బీసీ, ఓసీ వర్గాలకు రూ.4 వరకు మాత్రమే వసూలు చేయాల్సిన నిబంధనలు ఉన్నట్లు సమాచారం. అయితే క్షేత్రస్థాయిలో ఒక్కో 20 లీటర్ల క్యాన్‌కు రూ.10 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించి ఫోన్‌పే డిజిటల్ చెల్లింపుల ఆధారాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. సబ్సిడీ ధరలో ప్రజలకు అందాల్సిన నీటిని రెట్టింపుకుపైగా ధరకు విక్రయిస్తే.. ఆ అదనపు డబ్బు ఎవరి జేబులోకి వెళ్తోంది? క్యాన్లతో ఆగలేదట.. ఆటోల ద్వారా చిల్లర దుకాణాలకు సరఫరా సుజలాం ప్లాంట్ ఉద్దేశం ప్రజలకు తక్కువ ధరలో తాగునీరు అందించడం. కానీ ప్రస్తుతం నీటిని ఆటోల ద్వారా వివిధ ప్రాంతాలకు తరలించడం, చిల్లర దుకాణాలకు సరఫరా చేయడం, ఒక్కో క్యాన్‌ను రూ.10 చొప్పున విక్రయించడం జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ సబ్సిడీతో ఉత్పత్తి అయ్యే నీటిని ప్రైవేటు వ్యాపార సరుకుగా మార్చే అధికారం నిర్వాహకుడికి ఎవరు ఇచ్చారు? చిల్లర దుకాణాలకు వాణిజ్యపరంగా సరఫరా చేసేందుకు అనుమతి ఉందా? ఉంటే ఏ నిబంధనల ప్రకారం? లేకపోతే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదు? అన్నది తేలాల్సి ఉంది.

### 16 ఏళ్ల లెక్కలు బయటకు తీయాలి

ఈ వ్యవహారం సుమారు 16 ఏళ్లుగా కొనసాగుతున్న నేపథ్యంలో.. ఇంతకాలంలో ఎన్ని క్యాన్ల నీటిని ఉత్పత్తి చేశారు? ఎన్ని క్యాన్లు విక్రయించారు? ఎంత మొత్తంలో నగదు, డిజిటల్ చెల్లింపులు జరిగాయి? ప్రభుత్వ సబ్సిడీ ఎంత వచ్చింది? నిర్వహణ ఖర్చులు ఎంత? ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం ఏమైనా ఉందా? వంటి అంశాలపై పూర్తి స్థాయి ఆడిట్ జరపాలని ప్రజలు కోరుతున్నారు. రోజుకు వందల క్యాన్లు.. ఒక్కో క్యాన్‌పై అదనపు వసూళ్లు.. పదహారేళ్ల కాలం.. మొత్తంగా ఎన్ని కోట్లు చేతులు మారాయో ప్రభుత్వం లెక్క తేల్చాలి అని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### ప్రభుత్వ కార్యాలయాలకు ఉచిత నీరు ఎక్కడ?

ప్లాంట్‌కు సంబంధించిన ఒప్పంద నిబంధనల ప్రకారం బస్టాండ్, పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం తదితర ప్రజా వినియోగ ప్రాంతాలకు ఉచితంగా తాగునీరు అందించాల్సి ఉంటే ప్రస్తుతం ఆ సరఫరా జరుగుతోందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజా సమావేశాలు, అధికారిక కార్యక్రమాల సమయంలో అవసరమైన నీటి క్యాన్లు ఉచితంగా అందించాల్సిన నిబంధనలు ఉంటే వాటిని ఎందుకు అమలు చేయడం లేదో అధికారులు వెల్లడించాలి. ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్లాంట్.. ప్రజలకే నీరు ఇవ్వకపోతే దాని అసలు ఉద్దేశం ఏమిటి? రెండేళ్లుగా మున్సిపాలిటీ.. మరి ఏం చేసింది? అశ్వారావుపేట గ్రామ పంచాయతీ మున్సిపాలిటీగా మారి సుమారు రెండేళ్లు కావస్తున్నా సుజలాం ప్లాంట్ వ్యవహారంలో స్పష్టమైన చర్యలు ఎందుకు కనిపించడం లేదన్నది ప్రధాన ప్రశ్నగా మారింది. పంచాయతీ ఉన్నప్పుడు నిర్లక్ష్యం.. మున్సిపాలిటీ వచ్చిన తర్వాత మౌనం.. మరి ప్రజల హక్కులను కాపాడేది ఎవరు? మున్సిపాలిటీ ఏర్పడిన వెంటనే లీజు ఒప్పందం, పంచాయతీ తీర్మానాలు, ధరల పట్టిక, నీటి ఉత్పత్తి, విక్రయాలు, ఆదాయ లెక్కలు, ఉచిత నీటి సరఫరా నిబంధనలు తదితర అంశాలపై విచారణ జరపాల్సి ఉంది. కానీ రెండేళ్లు గడిచినా పూర్తి స్థాయి చర్యలు కనిపించకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది.

### రాజకీయ అండ ఉందా?

సుజలాం ప్లాంట్ వ్యవహారంలో కొందరు రాజకీయ నాయకులు పేజీ 2లో..

# పంచాయతీ పాపం.. మున్సిపాలిటీ మౌనం

**మొదటి పేజీ తరువాయి...**
నిర్వాహకుడికి అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలు వాస్తవమా? కాదా? అన్నది సంబంధిత నాయకులు ప్రజలకు స్పష్టం చేయాల్సి ఉంది. అధికారులు చర్యలు తీసుకోకుండా ఉండటానికి రాజకీయ ఒత్తిళ్లు కారణమా? లేక అధికారుల నిర్లక్ష్యమేనా? అన్నది సమగ్ర విచారణలో తేలాలి. కోర్టు స్టే పేరుతో వ్యవహారం కొనసాగుతోందా? ప్లాంట్ నిర్వహణకు సంబంధించిన వివాదంపై న్యాయస్థానంలో తాత్కాలిక స్టే ఉన్నట్లు సమాచారం. అయితే కోర్టు వ్యవహారం ఒకవైపు కొనసాగుతున్నప్పటికీ.. ప్రజల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు, సబ్సిడీ నిబంధనల ఉల్లంఘనలపై అధికారులు విచారణ జరపడానికి ఏ అడ్డంకి ఉందన్నది ప్రజల ప్రశ్న. మున్సిపాలిటీ తరఫున సంబంధిత రికార్డులతో బలమైన వాదనలు వినిపించారా? స్టే ఎత్తివేతకు చర్యలు తీసుకున్నారా? అనే అంశాలపై కూడా ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**మున్సిపల్ కమిషనర్ సమాధానం చెప్పాలి**
ఈ మొత్తం వ్యవహారంలో ప్రస్తుతం ప్రధాన ప్రశ్న మున్సిపల్ యంత్రాంగంపైనే ఉంది. మున్సిపాలిటీ ఏర్పడి రెండేళ్లు అవుతున్నా సుజలాం ప్లాంట్‌పై ఏ చర్యలు తీసుకున్నారు? లీజ నిబంధనలు తనిఖీ చేశారా? ధరల ఉల్లంఘనలను పరిశీలించారా? ఫోన్‌పే చెల్లింపులపై విచారణ చేశారా? ఆటోల ద్వారా చిల్లర దుకాణాలకు సరఫరా జరుగుతుంటే ఎందుకు పట్టించుకోలేదు? అనే ప్రశ్నలకు మున్సిపల్ కమిషనర్ సమాధానం చెప్పాల్సిందే అని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన సబ్సిడీ నీటి ప్లాంట్.. ప్రజలకే భారంగా మారుతున్నా అధికారులు స్పందించకపోతే అధికారుల బాధ్యత, జవాబుదారీతనం ఎక్కడ? అని ప్రజలు నిలదీస్తున్నారు. బాధ్యత నిర్వర్తించలేకపోతే పదవిలో ఎందుకు?

ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన ప్రభుత్వ ప్లాంట్‌పై ఇన్ని ఆరోపణలు వస్తున్నా చర్యలు తీసుకోలేని పరిస్థితి ఉంటే.. సంబంధిత అధికారి తన బాధ్యతలపై ప్రజలకు వివరణ ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రయోజనాలను కాపాడలేని స్థితిలో ఉంటే పదవిలో కొనసాగడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. బాధ్యత నిర్వర్తించలేని అధికారులు పదవుల నుంచి తప్పుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ఇకనైనా ప్రభుత్వం మేల్కొంటుందా?**
సుజలాం ప్లాంట్ మొత్తం వ్యవహారంపై జిల్లా కలెక్టర్ స్థాయిలో సమగ్ర విచారణ జరిపించాలి. గత 16 ఏళ్ల రికార్డులను పరిశీలించాలి. ప్లాంట్ ఉత్పత్తి, విక్రయాలు, ధరలు, ఫోన్‌పే లావాదేవీలు, ఆటోల ద్వారా సరఫరాలు, చిల్లర దుకాణాలకు విక్రయాలు, లీజ నిబంధనలు, సబ్సిడీ ప్రయోజనం, ఉచిత నీటి సరఫరా తదితర అంశాలపై పూర్తి లెక్కలు బయటపెట్టాలి. ప్రభుత్వ సబ్సిడీతో ఏర్పాటైన ప్లాంట్.. ప్రైవేటు లాభాల కోసం నడిచే వ్యాపార కేంద్రంగా మారిందా? రూ.2-4కి అందాల్సిన నీరు రూ.10కి ఎందుకు? సబ్సిడీ ఎవరి జేబులోకి వెళ్తోంది? ఆటోల ద్వారా సరఫరాలకు అనుమతి ఎవరిది? చిల్లర దుకాణాలకు విక్రయించే అధికారం ఎవరిచ్చారు? 16 ఏళ్ల లెక్కలు ఎక్కడ? రెండేళ్లుగా మున్సిపాలిటీ ఏం చేస్తోంది? మున్సిపల్ కమిషనర్ ఎందుకు స్పందించడం లేదు? ఈ ప్రశ్నలకు అధికారులు ఇకనైనా ప్రజల ముందు సమాధానం చెప్పాలి. సుజలాం ప్లాంట్ ప్రజల కోసం ఏర్పాటు చేసిందా? లేక కొందరి వ్యాపారం కోసం ఏర్పాటు చేసిందా? అన్న వాస్తవం తేలే వరకు ఈ వ్యవహారంపై పోరాటం కొనసాగుతుందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. **– నవతరం పత్రిక, ప్రత్యేక దర్యాప్తు కథనం**





## 'వృద్ధాప్యం' అంటే ఆవేదనా...ఆశీర్వాదమా...?

పిల్లల మధ్య ఉంటే–
వృద్ధాప్యం వసంతం
దూరమైతే అదే శిశిరం..!

మనవళ్ల చేతుల్లో
చేయి ఉంటే–ప్రతి రోజు పండుగే..!

పలకరించే ఒక మాట–
మాత్రలకన్నా మధురమైన మందు..!

"మీరు మాకు భారం" అనే మాటతో –
అమృతమయ జీవితం అగ్నిగుండమే..!

ఆప్యాయత ఉన్న ప్రతి ఇంట్లో–
ముసలి గుండె కూడా చిగురిస్తుంది..!

అనాథ భావన ఉన్న
గదిలో–గోడలే నేస్తాలవుతాయి..!

పిల్లల ప్రేమ–
ఎండిన కొమ్మపై పూసే చివరి పుష్పం..!

పిల్లల నిర్లక్ష్యం–
జీవించిన మనిషికి వ్రాసే మరణశాసనం

వృద్ధాప్యం ఏమీ కాదు మనం
ఆదరిస్తే ఆశీర్వాదం–వదిలేస్తే విషాదం..!

**రచన:**
కవిరత్న,
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్





# విద్యార్థుల భద్రతే ముఖ్యం కావాలి

- కాలేజీ యాజమాన్యాలు ఆ దిశగా ఆలోచించాలి
- ఫేక్ ఫైర్ ఎన్‌వోసీపై కాలేజీలకు హైడ్రా - ఇంటర్ బోర్డు దిశానిర్దేశం

**హైదరాబాద్, నవతరం:** విద్యార్థుల భద్రత ముఖ్యం కావాలి. కాలేజీ యాజమాన్యాలు ఆ దిశగా ఆలోచించాలని హైడ్రా - ఇంటర్ బోర్డు సూచించాయి. అనుకోని పరిస్థితుల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే విద్యార్థులు, బోధనా సిబ్బంది సురక్షితంగా బయట పడేందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని కోరాయి. ఇందుకు అనుగుణంగా ఏమైనా మార్పులు చేర్పులు అవసరమైతే వెంటనే చేపట్టాలన్నాయి. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీల నేపథ్యంలో హైడ్రా కేసులు పెట్టడం.. ఇంటర్ బోర్డు ఆయా కళాశాలపై చర్యలు తీసుకున్న వేళ.. నిర్వాహకులతో హైడ్రా - ఇంటర్ బోర్డు సంయుక్తంగా సమామేశాన్ని ఏర్పాటు చేశాయి. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీలతో విద్యార్థుల భద్రతను గాలిలో పెట్టొద్దని సూచించాయి. ఇదే సమయంలో ఆయా కళాశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నాయి. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీలు పెట్టడానికి గల కారణాలపై ఆరాతీశాయి. అనంతరం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ మాట్లాడారు. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీల పేరిట కళాశాలల యాజమాన్యాలను ఇబ్బంది పెట్టడం ఇరు శాఖల ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. కళాశాలల యాజమాన్యాలు కోరిన విధంగా ప్రతి ఏటా కాకుండా రెండేళ్లకోసారి రెన్యూవల్ చేసుకునే వెసులుబాటును కల్పిస్తామని హైడ్రా కమిషనర్ చెప్పారు. అలాగే రెండో స్టైర్‌కేస్ ఉండేలా చర్యలు తీసుకోవాలని.. పాత భవనాలకు వెసులుబాటు లేకపోతే ప్రత్యామ్నాయం చూడాలని సూచించారు.

**ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోగలరు..**
ఫైర్ ఎన్ వోసీలు, వాటి రెన్యూవల్స్ కోసం https://hydraafirenoc.telangana.gov.in హైడ్రా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. బ్రోకర్లను నమ్మి మోసపోవద్దన్నారు. ఫైర్ ఎన్ వోసీల జారీని సరళతరం చేశామన్నారు. హైడ్రా అనుమతి పొందిన ఏజెన్సీల ద్వారా ఫైర్ ఎన్ వోసీలు జారీ చేసే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తామన్నారు. ఆన్లైన్లోనే దరఖాస్తుల స్వీకరణ, అనుమతుల మంజూరీ, పాత అనుమతుల పునరుద్ధరణ, వాటికి సంబంధించిన ఫీజుల చెల్లింపులు.. ఇలా అన్నీ ఆన్లైన్లోనే జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్తో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) ఇలా క్యూర్ (కోర్ అర్బన్ రీజయన్ ఎకానమీ) పరిధిలోని మూడు కార్పొరేషన్ల పరిధిలో ఉన్నవారంతా ఇదే విధంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హైడ్రా కార్యాలయం వరకూ ఎవరూ రావాల్సిన పని లేదని పేర్కొన్నారు. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీలకు సంబంధించి సూత్రదారులు, పాత్రదారులు ఎవరనేదానిపై లోతైన విచారణ జరుగుతుందని అన్నారు. బాధ్యులపై చర్యలుంటాయన్నారు. ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు ఎవరికి వారు ఫైర్ ఎన్‌వోసీలు సరైనవా కావా అని సరి చూసుకోవాలన్నారు. కళాశాలలను ఇబ్బందిపెట్టేది ఏమీ లేదని ఇరు శాఖలు స్పష్టం చేశాయి. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీలు పెట్టిన కళాశాలలకు విధించిన రూ. 8 లక్షల అపరాధ రుసుం విషయంలో కూడా పునరాలోచన చేస్తామని ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ తెలిపారు. అంతకు ముందు హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య మాట్లాడుతూ ఫైర్ నిబంధనలను వివరించారు. అలాగే ఇంటర్ బోర్డు సంయుక్త కార్యదర్శి వసుంధర సమావేశ వివరాలను అందించారు.









# కబ్జాలకు గురౌతున్న అసైన్‌మెంట్ భూములు

**హైదరాబాద్, నవతరం:** నగర శివార్లలో అసైన్‌మెంట్ భూములు కబ్జాలకు గురౌతున్నాయని.. వాటిని కాపాడాలని నగర ప్రజలు కోరారు. అసైన్‌మెంట్ భూముల్లో వెలిసిన లే ఔట్లకు రక్షణ లేదు కాని... కబ్జాలకు కట్టడి లేకుండా పోతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ఉదాహరణ.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడలోని సర్వే నంబరు 12/3, 4లలో ఉన్న అసైన్‌మెంట్ ల్యాండ్ అని పేర్కొన్నారు. 1991లో ఈ సర్వే నంబర్లలో లే ఔట్ వేయగా.. తామంతా ప్లాట్లు కొన్నామని.. వాటిని రెగ్యులరైజ్ చేయమని దరఖాస్తు చేసుకుంటే పరిగణించలేదని వాపోయారు. ఇప్పుడదే సర్వే నంబరు ల్యాండ్ తమదంటూ కొంతమంది ప్రహరీ నిర్మించేశారని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అసైన్‌మెంట్ ల్యాండ్ ప్రభుత్వానికైనా చెందాలి.. లేదంటే అందులో లే ఔట్ ప్రకారం ప్లాట్లు కొన్నవారికైనా దక్కాలని వారంతా డిమాండ్ చేశారు. మధ్యలో కబ్జాదారులు ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తే తాము ఏం కావాలని వాపోయారు. నగరంలో హైడ్రా అభివృద్ధి చేస్తున్న చెరువులు భద్రంగా మారాయని.. మిగిలిన చాలా చెరువులు ఇంకా కబ్జాలకు గురౌతున్నాయని వాటిని కాపాడాలని హైడ్రా ప్రజావాణిలో నగరంలోని పలు ప్రాంతాల వారు కోరారు. ఇలా హైడ్రా ప్రజావాణికి మొత్తం 47 ఫిర్యాదులు రాగా.. వాటిని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు, అడిషనల్ కమిషనర్ డి. ఆనంద్‌కుమార్ పరిశీలించి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అందజేశారు.

**ఫిర్యాదులు ఇలా..**

సరూర్‌నగర్, లింగోజిగూడ గ్రామంలోని సర్వే నంబర్ 35, లో 100 సంవత్సరాలకు పైగా పురాతనమైన మెట్ల బావిని పరిరక్షించాలని గ్రామస్తులు కోరారు. గ్రానైట్ రాళ్లతో నిర్మించిన ఈ బావి 50 నుంచి 60 అడుగులకు పైగా లోతు ఉందని, గతంలో ఇందులో నీటిని చుట్టుపక్కల ప్రజలు వినియోగించేవారని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. గ్రామ పటంలోనూ బావి వివరాలు ఉన్నాయని తెలిపారు. అయితే 2002లో బావిని నిర్మాణ వ్యర్థాలు, మట్టితో పూడ్చివేసినట్లు ఆరోపించారు. బావిని పునరుద్ధరించి పరిరక్షించాలని హైడ్రాను కోరారు.

నాదర్‌గుల్ గ్రామం గీతానగర్ లేఅవుట్ ప్లాట్ నంబర్ 130ను ఆనుకుని ఉన్న 25 అడుగుల వెడల్పు ప్రభుత్వ రహదారిని ఆక్రమించినట్లు అక్కడి లే ఔట్ నివాసితులు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి, ఆమోదిత లేఅవుట్, రహదారి హద్దులను నిర్ధారించాలని కోరారు. రహదారిపై జరిగిన ఆక్రమణను తొలగించి ప్రజల రాకపోకలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

బండ్లగూడ మండలం గౌలిపురలోని సర్వే నంబర్ 251లో మూడు ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని స్థానికులు హైడ్రాను కోరారు. ఈ భూమి జీహెచ్ఎంసీకి చెందినదిగా పేర్కొంటూ, గతంలో మున్సిపల్ డంపింగ్ యార్డుగా ఉపయోగించేవారని తెలిపారు. నెల రోజులుగా ఖాళీ స్థలంలో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నాయని, అర్ధరాత్రి వేళల్లోనూ పనులు చేపడుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిరక్షించాలని కోరారు.

సుల్తాన్‌పూర్ రెవెన్యూ పరిధి, అమీన్పూర్ మండలంలో సర్వే నంబర్లు 71, 174, 457, 316 కుంటలు, చెరువులను మట్టి, రాళ్లతో పూడ్చుతున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. జంగం కుంట, రాజంగారి కుంట, బోయినికుంట, గండిగూడెం చెరువు ప్రాంతాల్లో పూడ్చివేతలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆయా జలవనరులను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో పరిశ్రమలు, ఇతర నిర్మాణాలకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. చెరువుల్లోకి వచ్చే వరద నీటి కాలువలు, కల్వర్టులు సైతం మూసివేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో కూడా ఈ అంశంపై సంబంధిత సంస్థలకు అధికారులు నోటీసులు ఇచ్చినా పూడ్చివేతలు ఆగలేదని ఆరోపించారు.

బాటసింగారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 321లో సుమారు 84 ఎకరాల చెరువు బఫర్ జోన్ ఉందని, ఆ ప్రాంతాన్ని ఆక్రమించి కళాశాల నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. చెరువు, బఫర్ జోన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలను అడ్డుకోవాలని హైడ్రాను కోరారు.








# బ్యాడ్మింటన్ జోడీని అభినందించిన రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, నవతరం:** ఇటీవల జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మహిళల డబుల్స్ విభాగంలో కాంస్య పతకం (Bronze Medal) సాధించిన బ్యాడ్మింటన్ జోడీ పుల్లెల గాయత్రి గోపీచంద్ - త్రిసా జాలీలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ తో కలిసి వారు ముఖ్యమంత్రి ని జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీవీ లక్ష్మి ఉన్నారు.







# నైని ప్రాజెక్ట్ స్ఫూర్తితో దేవదుర్గంపై దృష్టి

**హైదరాబాద్, నవతరం:** కర్ణాటకలోని దేవదుర్గం బంగారం మరియు రాగి ఖనిజ బ్లాక్‌లో అన్వేషణ కార్యకలాపాలను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి అధికారులను ఆదేశించారు. బుధవారం నాడు మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో సింగరేణి సంస్థ కొత్త ప్రాజెక్టులు మరియు భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపై ఆయన ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కర్ణాటకలో సింగరేణి దక్కించుకున్న దేవదుర్గం బంగారం మరియు రాగి అన్వేషణ బ్లాక్‌పై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధి ప్రకాష్ జ్యోతి, డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, తిరుమల రావు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులు మరియు అన్వేషణ పనుల పురోగతిని స్వయంగా పరిశీలించేందుకు, గురువారం నాడు సింగరేణి ఉన్నతాధికారులతో కలిసి దేవదుర్గం బ్లాక్‌ను సందర్శించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఖనిజ అన్వేషణకు అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు మరియు ఇతర సహకారాన్ని పొందడంలో కర్ణాటక ప్రభుత్వం నుండి పూర్తి సహకారాన్ని కోరతామని ఆయన చెప్పారు. దేవదుర్గం ప్రాజెక్టును విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడం ద్వారా, బొగ్గు రంగం నుండి కీలక మరియు వ్యూహాత్మక ఖనిజాల రంగానికి సింగరేణి విస్తరణకు బలమైన పునాది పడుతుందని ఆయన పేర్కొన్నారు. గనుల రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి, ఇకపై కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా, కీలక మరియు వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ మరియు వెలికితీత రంగాలకు విస్తరించాలని భట్టి విక్రమార్క నొక్కి చెప్పారు. ఈ ప్రయత్నంలో తెలంగాణ ప్రభుత్వం సాధ్యమైనంత అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణకు వెన్నెముకగా నిలిచిన ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిని, భవిష్యత్ తరాలకు ఒక బలమైన సంస్థగా అందించేలా మరింత లాభదాయకమైన మరియు శక్తివంతమైన సంస్థగా మార్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు.

**డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి**

కీలక ఖనిజాల రంగంలోకి విస్తరిస్తున్నప్పటికీ, సింగరేణి ప్రధాన వ్యాపారమైన బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టిని కొనసాగించాలని ఉప ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. 'ఎల్ నినో' ప్రభావంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నందున, ఆ డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తిని పెంచే చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా విద్యుత్ మరియు ఇంధన భద్రత ప్రాముఖ్యత మరింత పెరిగిందని, ఈ విషయంలో సింగరేణి కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. సింగరేణిని కీలక ఖనిజాల రంగంలో దేశంలోని అగ్రగామి సంస్థలలో ఒకటిగా తీర్చిదిద్దేందుకు బలమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.

**దేవదుర్గంపై ప్రత్యేక దృష్టి**

దేవదుర్గం బంగారం మరియు రాగి ఖనిజ బ్లాక్‌లో ఇప్పటివరకు చేపట్టిన పనులు, అక్కడి భౌగోళిక పరిస్థితులు మరియు ఖనిజ నిల్వల అంచనాకు అవసరమైన తదుపరి చర్యల గురించి ఉప ముఖ్యమంత్రి అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్వేషణ ప్రక్రియను వేగవంతం చేయడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితులు మరియు సవాళ్లను స్వయంగా అర్థం చేసుకునేందుకు, ఆయన గురువారం నాడు సింగరేణి ఉన్నతాధికారుల బృందంతో కలిసి దేవదుర్గం బ్లాక్‌ను సందర్శించనున్నారు. ఖనిజ అన్వేషణను వేగవంతం చేయడానికి అవసరమైన సహకారంపై కర్ణాటక ప్రభుత్వంతో కూడా చర్చలు జరుపుతామని ఆయన తెలిపారు. సింగరేణిని 'కీలక ఖనిజాల' (critical minerals) రంగంలోకి విస్తరించేందుకు 'దేవదుర్గ బ్లాక్'ను ఒక కీలక అవకాశంగా మలచుకోవాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.

**అన్ని ఖనిజ వేలం ప్రక్రియల్లోనూ పాల్గొనాలి**

దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ తమ కార్యకలాపాలను విస్తరించాలని సింగరేణిని భట్టి విక్రమార్క ఆదేశించారు. జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న బొగ్గు, కీలక ఖనిజాల వేలం ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షించాలని, సింగరేణికి ప్రయోజనకరమైన ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా, ఇతర ఖనిజాల తవ్వకాల్లోనూ బలమైన ఉనికిని చాటుకోవాలని ఆయన అన్నారు. వెనేడియం, టైటానియం వంటి కీలక వనరులు కలిగిన ఖనిజ బ్లాకులు త్వరలో వేలానికి రానున్నందున, వాటిని దక్కించుకునేందుకు ముందస్తుగా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రయత్నాలకు ప్రజా ప్రభుత్వం అవసరమైన అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. ఇంధన, పారిశ్రామిక రంగాలలో ప్రపంచవ్యాప్తంగా వేగంగా వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని, రాగి (copper), గ్రాఫైట్, లిథియం మరియు కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల తవ్వకానికి సంబంధించిన అవకాశాలను పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి సింగరేణిని కోరారు. భవిష్యత్తులో ఈ ఖనిజాలకు పెరుగుతున్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని సంస్థ కొత్త అవకాశాలను గుర్తించాలని ఆయన అన్నారు. దక్షిణాఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా మరియు చిలీ వంటి దేశాలలో ఖనిజ అన్వేషణ అవకాశాలను అధ్యయనం చేయడానికి అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించినట్లు ఆయన తెలిపారు. అంతర్జాతీయంగా వస్తున్న అవకాశాలను పరిశీలించి, సింగరేణికి ప్రయోజనకరమైన ప్రాజెక్టుల విషయంలో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు.



# డ్రైనేజీ నీటి సమస్యను పరిష్కరించండి

**కుత్బుల్లాపూర్, నవతరం:** సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులారా ఈ యొక్క సమస్యను పరిష్కరించండి అంటూ సామాజిక కార్యకర్త, పర్యావరణ ప్రేమికులు కోల రవీందర్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. సూరారం మెయిన్ రోడ్ లో బస్ స్టాప్ వద్ద డ్రైనేజీ నీరు పొంగడం వేలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డు వాహనదారులకు నరకయాతన, ట్రాఫిక్ పోలీసులకు తీరని బాధ.. ఈ రోడ్డు వెంట ఆరు నెలల నుండి వేసే పైపులైన్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రక్కన ఉన్న పాత డ్రైనేజీ లైన్ డ్యామేజ్ అవ్వడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది, (గత ఏడాది కూడా రోడ్డు ఇటుపక్క నర్సాపూర్ టు బాలానగర్ వెళ్లే పక్క రోడ్ లో (వర్షపు నీటి) కాలువ నిర్మాణంలో నెలల తరబడి నిర్లక్ష్యంతో.. ప్రజలు తిరగబడడంతో, పై అధికారుల ఒత్తిడితో పని పూర్తి చేసినాడు) దీనితో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం, కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతుంది, ట్రాఫిక్ పోలీసులకు తలకు మించిన భారమవుతుంది, వాహనాల మెయింటెనెన్స్ దారిన పోయే వారి పైన బురద, పడి బట్టలు ఖరాబవడం, ఇదే కాకుండా బస్ స్టాప్ ఎదురుగా ఆర్కే ట్రాన్స్పోర్ట్, ముందర డ్రైనేజీ పైన కప్పు లేకపోవడం ప్రమాదకరంగా మారింది. దానిపైన సిమెంట్ కప్పు మూతలు వేస్తున్నారు, ఇవి కాకుండా ఇనుపరాళ్లతో ఉన్న స్టీల్ మూత వేయాలి, ఈ రోడ్డుపై వందల టన్నుల బరువైన భారీ, అతి భారీ వాహనాలు తిరుగుతాయి కావున అధికారులు ఆలోచించి ఈ సమస్యను పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా వెంటనే స్పందించి పరిష్కరిస్తారని ఆశిస్తున్నామన్నారు కోల రవీందర్ ముదిరాజ్.




# పటాన్‌చెరులో ఘనంగా ఈద్ – ఈ – మిలాద్

**పటాన్చెరు, నవతరం:** జష్నే ఈద్ మిలాద్-ఉన్-నబీ సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలో మిలాద్-ఉన్-నబీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు, MDR ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. వెంకటేశ్వర థియేటర్ వద్ద MDR ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్న వారికి శీతల పానీయాలు, తాగునీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. అన్ని మతాలు, వర్గాల ప్రజలు పరస్పర గౌరవం, సహనం, సోదరభావంతో కలిసి మెలిసి జీవించాలని ఆకాంక్షించారు. శాంతి, ఐక్యత, మానవత్వం, సమానత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈద్ – ఈ – మిలాద్ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న ముస్లిం సోదరులు, యువతకు మాద్రి పృథ్వీరాజ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.







### చర్చి గాగిల్లాపూర్‌లో రూ.40.50 లక్షలతో స్మశాన వాటిక

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**కుత్బుల్లాపూర్, నవతరం:** దుందిగల్ డివిజన్ పరిధిలోని చర్చిగాగిల్లాపూర్ (214) లో రూ.40.50 లక్షల నిధులతో చేపట్టనున్న స్మశాన వాటిక అభివృద్ధి పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. రూ.40.50 లక్షలతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనుల ద్వారా స్మశాన వాటికలో అవసరమైన మౌలిక వసతులు మెరుగుపడనున్నాయని తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కల మల్లేష్ యాదవ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బొట్ల విజయ్ కుమార్, డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు చెవిటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, కావలి శశి కుమార్, ఆకుల ప్రేమ్, శ్రీకర్ రెడ్డి, మైనార్టీ నాయకులు నయీమ్, మహేందర్ యాదవ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.






## బైరి ప్రశాంత్ ను పరామర్శించిన నర్సారెడ్డి భూపతిరెడ్డి

**కుత్బుల్లాపూర్, నవతరం:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బైరి ప్రశాంత్ గౌడ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ప్రశాంత్ గౌడ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి. ఈ కార్యక్రమంలో దూలపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బైరి శివ కుమార్ గౌడ్, గణేష్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇరుగు రాధాకృష్ణ, రంగారెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జలీల్ ఖాన్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, అంజి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.






Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally (B.Tech, MBA, Journalism (NiMA)) - Bureau Chief, Telangana, 9618907705, E-mail: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://epaper.navatharam.com